# మనిషి



పాలకూర సీతాలత

ఆపి ఆర్టీసీవారి డిస్ట్రిక్ట్ బస్. కండక్టర్

కరుణాకరం 'రైట్' చెప్పగానే గేరు మార్చి బస్సును బయలుదేరదీశాడు డ్రైవరు. ఆ గేరు మారుస్తున్నప్పుడు బండరాయి మీద పడినంత చప్పుడు వచ్చింది. టికట్లు అందరికీ ఇచ్చినట్లు నిర్ధారణ చేసుకుని తన సీట్లో కూర్చున్నాడు కరుణాకరం, వెనక్కి వెళ్ళిపోతున్న చెట్లవంక చూస్తూ. మరొక రెండు నిముషాల తర్వాత జేబులోంచి సిగరెట్ తీసి అంటించుకున్నాడు, "బస్సులో పొగ త్రాగరాదు" అని రాసి వున్న అక్షరాల వంక నిర్లక్ష్యంగా చూస్తూ.

బస్సు కొంచెం వేగం అందుకునేసరికి ప్రయాణీకులు సీటుకి జార్లబడి కళ్లు మూసుకున్నారు. అది రాత్రి సమయం కాకపోయినా బస్సులు, రైళ్లు వెళ్తున్నప్పుడు సీటుకి జార్లబడి నిద్రపోవడం చాలామందికి అలవాటు. ఒక కాలేజీ కుర్రాడు ఇంగ్లీషు నవల ఒకటి అడ్డుపెట్టుకుని ముందు సీట్లో కూర్చున్న ఒక అందమైన అమ్మాయి వంక దొంగచూపులు చూస్తున్నాడు.

"సార్ .... ఆ పేపరు ఒకసారి ఇస్తారా?" అని అడిగిన ఒక పెద్దమనిషి ఆ పేపరు స్వంతదారు ఇంకా జవాబు ఇయ్యకుండానే తన చేతిలోకి పేపరు తీసుకున్నాడు.

ఒక నిముషం తర్వాత.

"అబ్బా .... ఎండలు మండిపోతున్నాయి.... సార్" అన్నాడు.

'అవును.... నీ దౌర్జన్యం లాగే అవీనూ....' అని అనుకున్నాడు. ఆ పేపరుని డబ్బుపెట్టి కొన్నవ్యక్తి. అరగంట తర్వాత ఏదో ఊర్లో బస్సు ఆగింది. కొందరు దిగిపోయేరు. మరికొందరు ఎక్కేరు. తలుపు దగ్గర ఒక ముసలమ్మ నిలబడి కరుణాకరంని అడిగింది.

"బాబూ!....ఈ బస్సు రావులపాలెం వెళ్తుందా?"

"ఆఁ....ఎక్కు...." అన్నాడు కరుణాకరం కరుకుగా.

ఆ కరుకుతనం పట్టించుకోనట్లు చేతిలో ఒక చిన్న గుడ్డమూటతో ఆ ముసలమ్మ బస్సు ఎక్కింది.

"రైట్... " అన్నాడు కరుణాకరం. బస్సు బయలుదేరింది.

ముసలమ్మ సీటుకోసం బస్సులో ఒక సారి చూసింది. ఇద్దరు కూర్చునే ఒక సీటులో ఒక వ్యక్తి కూర్చున్నాడు అది సరిగ్గా కరుణాకరం వెనకాలవున్న సీటు.

అక్కడికి వెళ్ళి కూర్చుంది ఆమె.

"టిక్కెట్" అన్నాడు కరుణాకరం ముసలమ్మతో.

"రావులపాలెంకి ఇయ్యి నాయనా..." అంది ఆమె చీరచెంగున వున్న యాభై రూపాయల కాగితం కరుణాకరంకి ఇస్తూ.

"చిల్లర ఇయ్యి...." అన్నాడు కరుణాకరం ఆ ముసలమ్మవంక పరీక్షగా చూస్తూ.

ఆమె తలంతా ముగ్గుబుట్టలా వుంది. ముఖం మీద వృద్ధాప్యపు ఛాయలు కొట్టొచ్చినట్లు కనపడుతున్నాయి వయసు అరవై అయిదు సంవత్సరాలు వుండొచ్చు. ఆ వయసులో ఇలా ఒంటరిగా ప్రయాణం చెయ్యగల ఓపిక వుండటం చాలా అదృష్టకరమే. నడ్డి కొంచెం వంగింది. పళ్ళు చాలాభాగం ఊడిపోయాయి.

"చిల్లర ఇయ్యి తల్లీ...." విసుగ్గా అన్నాడు కరుణాకరం.

"లేదు బాబూ." అంది నెమ్మదిగా.

"ఆ విషయం ఎక్కేటప్పుడు చెప్తే అప్పుడే దింపేసేవాడిని. నా దగ్గరా లేదు." అన్నాడు కరుణాకరం అబద్ధం చెప్తూ.

ఆ ముసలమ్మ పక్కన కూర్చున్న వ్యక్తి బీడీ ముట్టించుకుని—

"అలాగంటే ఈ ముసలమ్మ ఏమై పోతది! నీకాడ ఆ మాత్రం చిల్లరలేదా?" అన్నాడు. అనవసరంగా మధ్యలో మరొక వ్యక్తి జోక్యం చేసుకోవటం నచ్చలేదు కరుణాకరంకి. కొంచెం కోపం వచ్చింది కూడా అందుకు.

"ఆ బీడీ అవతల పారెయ్యి.... బస్సులో సిగరెట్ తాగకూడదు." అన్నాడు.

కిసుక్కున నవ్వాడు ఆ వ్యక్తి.

"ఇది సిగరెట్ కాదు.... " అన్నాడు బీడీ దమ్ము పీలుస్తూ.

"ఏదైనా సరే.... నిషేధం. బయట పారెయ్యి" అంటూ చిరాకుపడ్డాడు కరుణాకరం.

"మరి.... మరి.... ఇందాకా నువ్వు సిగరెట్ తాగేవుగందా?

కరుణాకరంకి ఎవరో చెంపమీద కొట్టినట్లు అయ్యింది.

ఆ బీడీ వ్యక్తితో ఇక ఘర్షణ పడదల్చుకోలేదు కనుక ఆ కోపం ముసలమ్మ మీద చూపించాడు.

"ఎనిమిది రూపాయల టిక్కెట్టుకి యాభైయి, వందలు ఇస్తే కుదరదు. చిల్లర ఇస్తే టిక్కెట్టు ఇస్తాను. లేకపోతే పక్క ఊళ్ళో దిగిపో...." అన్నాడు కరుణాకరం ముసలమ్మతో ఓరకంట బీడీ వ్యక్తి వైపు కోపంగా చూస్తూ.

అ వ్యక్తి చూడడానికి రౌడీలాగే వున్నాడు. గళ్లలుంగీ, ఎర్రచొక్కా వేసుకున్నాడు బుర్ర మీసాలు. ముఖంలో కరుకుతనం కొట్టొచ్చినట్లు కనపడుతోంది

కిళ్ళీలు తిని తిని, బీడీలు తాగి తాగి పళ్ళు గారపట్టిపోయాయి.

"అ ముసలమ్మ ఒక్కర్తే ఎల్లావుంది. మధ్య దారిలో దించేస్తానంటే ఏమైపోతాది? ఆవిడకు సిల్లర ఇయ్యి...." అన్నాడు బీడీవ్యక్తి కరుణాకరంతో.

"అంతగా నీకు జాలి పొంగిపోతుంటే ఆ చిల్లర ఏదో నువ్వే ఇయ్యరాదూ?" అన్నాడు కోపంగా కరుణాకరం.

"అలాగే .... నే నే ఇత్తాన్లే...." అన్నాడు ఆ వ్యక్తి.

"నా కోసం మీరు గొడవపడకండి. అసలు తప్పంతా మా అబ్బాయిది. చిల్లర ఇయ్యకుండా యాభై కాగితం ఒకటి చేతిలో పెట్టాడు. వాడి తప్పులేదు ఒక రకంగా. కోడలు పిల్ల నా ప్రయాణానికి ఒప్పుకోకపోతే అటు ఆమెకు నచ్చచెప్పలేక ఇటు నన్ను నొప్పించలేక చాటుగా ఈ డబ్బుతీసి ఇచ్చేడు. అ కంగారులో చూడలేదు కా బోలు........" అంది ముసలమ్మ

చిన్నగా నిట్టూర్చాడు బీడీవ్యక్తి.

"అయితే నీ కొడుకు.. పెళ్లాంచేతిలో కీలుబొమ్మన్నమాట...." అన్నాడు.

కరుణాకరం ఈ సంభాషణ అంతా వింటున్నాడు. ఆ ముసలమ్మ బస్సుఎక్కి అరగంట అయినా ఇంతవరకూ టిక్కెట్టు కొట్టలేదు ఆమెకి. ఫ్లైయింగ్ స్క్వాడ్ వస్తుందన్న భయంలేదు గానీ సాధారణంగా ప్రయాణీకులకు బస్సు ఎక్కిన వెంటనే టిక్కెట్టు ఇచ్చే అలవాటు తనది. ఆ ముసలమ్మను దింపెయ్యడానికి ఈ బీడీ వ్యక్తి అడ్డువస్తున్నాడు. తనదగ్గర నిజానికి చిల్లరవుంది గ నీ ఒకసారి 'లేదు' అని చెప్పాక దాన్ని అబద్ధం చేస్తూ చిల్లర ఇవ్వడానికి మనసు అంగీకరించటంలేదు. అ బీడీవ్యక్తి పక్కా రౌడీవెధవలాగ వున్నాడు వాడితో గొడవపడటం కూడా అంత మంచిది కా ద ని తోస్తోంది. చూద్దాం....మరి కాసేపు....


ఆ ముసలమ్మ అంటోంది.

"అలా అనకు నాయనా! వాడేం కీలుబొమ్మ కాదు నా కొడుకు. నా కొడుకు చాలా అమాయకుడు. కోడలుపిల్ల రాక్షసి. గొంతు విప్పకుండ ఊరంతా అరిచేస్తుంది. ఆమెను మంచిగా మార్చాలని నా కొడుకు ప్రయత్నించాడు కానీ లాభం లేకపోయింది. ఇంక వాడే ~~తగ్గిపోయాడు~~. ఎవరో ఒకరు సర్దిచెప్పకుంటే శాంతంగా వుండకపోతే ఆ సంసారం వీధిన పడదా నాయనా?"

"అదీ నిజమేలే...." అన్నాడు బీడీ వ్యక్తి.

అప్పుడే ఏదో ఊర్లో బస్సు ఆగింది.

"ఆ యాభై కాగితం ఇలా ఇయ్యి.. సిల్లర నేను ఇస్తాను...." అంటూ ఆ బీడీ




వ్యక్తి కొన్ని నోట్లు లెక్క పెట్టి ముసలమ్మ చేతిలో పెట్టాడు. ఆమె నుంచి యాభై కాగితం అందుకుని బస్సు దిగి వెళ్ళిపోయాడు.

ఆ ఊళ్లో మరో ఇద్దరు దిగేరు తప్ప ఎవ్వరూ ఎక్కలేదు.

"చిల్లర అతను ఇచ్చాడు నాయనా.." అంది కరుణాకరంతో ముసలమ్మ.

"ఒకసారి లెక్క పెట్టుకో. " అన్నాడు కరుణాకరం.

"పాపం.... ఆ కుర్రాడు ఎవరో మంచి వాడే.... నాకు చిల్లర ఇచ్చాడు." అంది ముసలమ్మ.

ఆమె అలా ఆ రౌడీ వెధవను పొగడ్డం కరుణాకరంకి నచ్చలేదు.

చూడగానే వాడొక దుర్మార్గుడని తెలిసిపోతుంటే ఈమె వాడిని పొగుడుతోంది.

ఏం మంచి.... గత మంచి....

ఆ వెధవ ఆమెకు పూర్తిగా చిల్లర ఇచ్చివుండడు. ఏ పాతికో, ముఫ్ఫైయ్యో ఇచ్చి దిగిపోయి వుంటాడు. ఆ స్వలాభం కోసమే ఆమెకు చిల్లర ఇచ్చి వుంటాడు. కానీ పరోపకారమూ కాదు...పాడూ కాదు. ఈ ముసల్ది ఆ కుట్ర అర్థం చేసుకోకుండా వాడిని ఇంద్రుడనీ, చంద్రుడనీ పొగుడుతోంది. వాడిని అలా గుడ్డిగా నమ్మినందుకు ఈ ముసల్దాన్ని నట్టేట ముంచి వుంటాడు. బాగానే అయ్యింది.

అయినా నిర్ధారణ చేసుకుందుకు—

"చిల్లర లెక్క పెట్టుకో . " అన్నాడు కరుణాకరం ఆమె చేతిలోని నోట్లవంక చూస్తూ.

"నాకు లెక్కపెట్టుకోవడం రాదు.." అంది ఆమె.

వెంటనే ఆమె చేతిలోంచి నోట్లన్నీ తీసుకుని లెక్క పెట్టసాగాడు.

ఒకటి .... రెండు .... మూడు .... నాలుగు.... అయిదు....

అయిదు పది రూపాయల నోట్లు.

కరుణాకరంకి నమ్మబుద్ధి కాలేదు. మరొకసారి లెక్క పెట్టాడు.

అంతే వున్నాయి. అయిదు కాగితాలు.. ఒక్కొక్కటి పది రూపాయలు ....

కరుణాకరం ముఖంలో తీవ్రమైన అసంతృప్తి కనిపించింది.

ఆ రౌడీవెధవ మోసం చెయ్యాలనీ, ముసలమ్మకు నష్టం కలగాలనీ ఆశించాడు.

కానీ ఆ ఆశ నిరాశ అయ్యింది.

మోసం చెయ్యరని అనుకున్న వాళ్లు మోసంచేస్తే తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతాం. అలాగే మోసం చేస్తారని అనుకున్నవాళ్లు మోసం చెయ్యక నమ్మకంగా ప్రవర్తించినప్పుడు కూడా అసంతృప్తికి గురి అవుతారన్నది కరుణాకరం విషయంలో జరిగింది.

ఆ రౌడీ వెధవ.... ఆ బీడీలు కాల్చుకునేవాడు.... ఆ కరుకుముఖంగాడు.... నిజాయితీగా ప్రవర్తించడమా?

"లెక్కట్టు ఇయ్య బాబూ...." అంది ముసలమ్మ.

ఆ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు కరుణాకరం.

పదిరూపాయల కాగితం తీసుకుని మిగతా నలభై ఆమెకు ఇయ్యబోతుంటే ఆ ముసలమ్మకు లెక్క పెట్టుకోవటం రాదన్న విషయం గుర్తొచ్చింది.

దీన్ని అలుసుగా తీసుకుని ఆమెను తను మోసంచేస్తే?

అందుకే రెండు పదులు తన పర్సులో పడేసుకున్నాడు, ఎనిమిది రూపాయలు టికట్టు కొట్టాడు. ముప్పై రూపాయలూ ఆమె చేతిలో పెట్టాడు.

ఆ ముసలమ్మ వెంటనే వాటిని తన చీరకొంగులో ముడివేసుకుంది.

ఆమెకు కరుణాకరం మీద పూర్తి విశ్వాసం. ఒకవేళ విశ్వాసం లేకపోయినా ఆమె చెయ్యగలిగేది ఏమీలేదు. ఎందుకంటే.... ఆమెకు లెక్క పెట్టుకోవడం రాదు,

"ఏమిటో నాయనా.... మా రోజుల్లో ఆడపిల్లకు చదువంటే నవ్వేవారు 'ఆడది చదువుకుని ఉద్యోగం చెయ్యాలా, ఊర్లు ఏలాలా' అని అనేవారు. చాకలి పద్దు రాసుకోగలిగిన చదువు చాలని అనేవారు. నేను ఆ మాత్రం కూడా చదవలేక పోయాను .... చదువుకోవల్సిన ఆ వయసులో మా అమ్మకు తీవ్రమైన జబ్బు చెయ్యడమే ఆ ఖర్మ కారణం. అందుకే ఈ రోజు నేను చిల్లరకూడా లెక్క పెట్టుకోలేను. అయినా నాకు బాధ లేదు....ఈ ముసలిదానికి అన్యాయం ఎవరు తలపెడతారు నాయనా? లోకంలో నీలాంటి మంచివాళ్ళు చాలామందే వున్నారు...." అంది ముసలమ్మ.

ఆ మాటలకు కరుణాకరం కొంచెం ఉలిక్కిపడ్డ మాట వాస్తవం.

ఆయినా వెంటనే సర్దుకున్నాడు.

బస్సు నడుస్తూంది. ప్రయాణీకులు ఎక్కువమంది లేరు. అందుకే కాబోలు.. కరుణాకరం ఆ ముసలమ్మతో బాతాఖానీ వేశాడు.

"ఎవరింటికి వెళ్తున్నావు?" అడిగేడు.

కూతురు గుర్తుకు రాగానే ఆ ముసలమ్మ కళ్లు చెమర్చాయి. చీరచెంగుతో కళ్ళు ఒత్తుకుంది.

"నా కూతురు దగ్గరకు వెళ్తున్నాను నాయనా!" అంది.

కరుణాకరం మాట్లాడలేదు. అర నిముషం తర్వాత మళ్ళీ ఆమె అంది.

"దాని బ్రతుకు ఇలా అయిపోయినందుకు నేను బాధపడని క్షణం లేదు నాయనా!"

కరుణాకరంకి ఆసక్తి కలిగింది.

"ఏమైంది?" అన్నాడు.

"కుర్రవాడు బుద్ధిమంతుడే అని ఆ రోజుల్లోనే పదివేలు కట్నంఇచ్చి పెళ్ళి చేశాం. ఇంట్లో పెళ్ళికి ఎదిగిన కూతురు వున్నా ఆ అల్లుడు ఆ తాగుడు అలవాటు మానలేదు. అసలే అనారోగ్యంతో బాధ పడుతున్న నా కూతుర్ని తాగొచ్చి తంతూ వుంటాడు. ఇలా చాలా సంవత్సరాలుగా జరుగుతూవున్నా నా కూతురు ఈ విషయం మాకు తెలియనివ్వలేదు. తర్వాత తెల్పింది. కానీ ఏం చేస్తాం? ఎన్నోసార్లు నచ్చచెప్పినా కుక్కతోక వంకర లాగ అతను మారలేదు ..సంపాదన తాగుడుకే సరిపోతే ఇక కూతురి పెళ్ళి ఎలాచేస్తాడు? ఈ విషయమే మా అమ్మాయి అడుగుతుంది. దాంతో అతను తోకతొక్కిన తాచులాగ లేస్తాడు.." అంది ముసలమ్మ.

కరుణాకరం మౌనం వహించాడు.

"మాయదారి తాగుడు....ఎన్ని సంసారాల్ని కొల్లగొట్టి పెట్టుకుంటోందో తెలియదు. ఈ తాగుడు మత్తు ఈ మగ మహారాజులకు ఏం సుఖం ఇస్తుందో అంతకంటె తెలియదు. ఈ బాధంన్నీ నన్ను పడమని.... ఆ మహారాజు తనదారి తను చూసుకున్నారు ...." ఆమె గద్గద స్వరంతో.

కరుణాకరంని ఎవరో వెన్ను చరచినట్లు అయింది. అందుకు కారణం అతను కూడా చిత్తంవచ్చినట్లు తాగి, భార్యను చితకబాదన్నదమే.... అతని కళ్ళముందు ఒకసారి భార్యరూపం కదిలింది. తను ఎంతగా చావగొట్టినా చచ్చినట్లు భరిస్తూ, కళ్ళలో నీళ్ళు నింపుకుని, చేతులు జోడించి ప్రార్థిస్తుంది ఆమె.

"నన్ను కొట్టినా ఫరవాలేదండీ.... కానీ మీరు ఈ తాగుడు మాత్రం మానండి. మీ ఆరోగ్యం పాడు చేసుకోకండి." అంటుంది.

తన ఈ అలవాటువల్ల భార్యమాత్రమే కాక ఆ భార్యయొక్క తల్లిదండ్రులు కూడా బాధపడుతూ వుండొచ్చు ఈ ముసలమ్మ మాటలవల్ల తెలుస్తోంది. కరుణాకరం మనసు చలించింది. తను

చేస్తున్నపని మంచిది కాదని మరొక్కసారి తెలుసుకున్నాడు. "బాధపడకు అవ్వా!".... నీ కూతురు బ్రతుకు బాగు కాకపోదు...." అన్నాడు గొంతు పెగల్చుకుని. ఆ మాటలు అంటున్నప్పుడు అతని గొంతు అతనికే కొత్తగా తోచింది.

"ఏదో నాయనా! అ ఆశతో నే రోజులు గడుపుతున్నాను. నీ నోటి చలవవల్ల ఆ రోజు రావాలేగానీ.... నీకు మరింత ఆయువు అభగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటాను. నీలాంటి మంచి మనుషులు లోకంలో అరుదు బాబూ.... ఈ ముసలిదాని గుండెల్లో రగులుతున్న చిచ్చును సరిగ్గా అర్థంచేసుకున్నావు...." అంది ఆమె.

కరుణాకరం చాలా ఇబ్బందికరంగా ఫీలయ్యాడు.

నిజానికి తను చాలా చెడ్డవాడు.... ఆమె సొమ్ము పన్నెండు రూపాయలు హరించాడు. తను కూడా తాగివచ్చి పెళ్లాంని చితగ్గొడతాడు. అలాంటి తనని ఆమె 'మంచివాడు' అంటోంది. ఆమె తనని ఉత్తముడని భ్రమిస్తోంది, ఆమె నమ్మకాన్ని వమ్ముచేసి ఆమె సొమ్ము హరించాడు తను.

ఛీ....ఇదేం పని! చదువురాని, అమాయకురాలైన ఒక ముసలమ్మను తను మోసం చెయ్యటమా!

కరుణాకరం గుండెల్ని ఎవరో చెరుకు గానుగలో వేసినట్లు అనిపించింది.

ఇప్పుడు తను ఏం చెయ్యాలి! ఆమె సొమ్ము ఆమెకు ఏ రకంగా తిరిగి ఇయ్యాలి! ఆమెను మోసంచేసిన విషయం ఆమెకు చెప్పడానికి చిన్నతనంగా వుంది అతనికి. నిజమే! దొంగ అనిజాన్ని అందరిముందూ ఒప్పుకోడు.

అలా అని ఆ సొమ్ము తను అనుభవించనూ లేడు. ఎలా?

చిరాగ్గా నుదిటిమీద చేత్తో రాసుకున్నాడు.

"ఏం నాయనా? తల నొప్పిగా వుందా? ....నా సోదిచెప్పి నీకు బాధ కలిగించాను కాబోలు...." అంది ఆమె పశ్చాత్తాపంగా.

ఆ ముసలమ్మ మంచితనం కరుణాకరాన్ని మరింత కృంగదీసింది.

ఆమెది ఎంత జాలిగుండె! లేకపోతే అలా ఎందుకు అంటుంది?

చెడ్డతనమే కాదు....ఒక్కొక్కసారి మంచితనాన్ని కూడా భరించలేకపోతాం. అదే జరిగింది కరుణాకరం విషయంలో ఇప్పుడు.

"అబ్బే .... అదేం కాదు అవ్వా.... ఊరకనే...." అంటూ తప్పించుకున్నాడు.

కరుణాకరం ఆలోచించేడు.

ఇలా ప్రయాణీకుల్ని, అటు ఆర్టీసీని మోసం చేస్తూ డబ్బులు జేబులో వేసుకోవడం తనకి కొత్తకాదు. తనకని ఏముంది? చాలావరకూ కండక్టర్లందరికీ ఇది మామూలే.... కానీ ఈ రోజు చిత్రంగా.... చాలా విచిత్రంగా.... ఆ



ముసలమ్మ దగ్గర కేవలం పన్నెండు రూపాయలు తీసుకున్నందుకు మనసు అతన్ని ఏలదీస్తోంది. ముద్దాయిని బోనులో వుంచి జడ్జీగారు అడుగుతున్నట్లు అడుగుతోంది. తన మనసుకే తను భయపడవల్సి వస్తోంది. ఇదేం చిత్రం!

'ఇచ్చెయ్యి.... ఆ పన్నెండు రూపాయలూ ఆమెకు ఇచ్చెయ్యి. ఎంతో మంచి వాడవని ఆమె నీ మీద వుంచుకున్న నమ్మకాన్ని వమ్ము చెయ్యకు నిజానికి ఆమె పాదాలమీద పడి క్షమించమని అడిగినా ఈ పాపం తీరదు ఆమె క్షమించినా కూడా ఈ పాపం తీరదు.' అంది మనసు.

అతను ఇన్నాళ్ళుగా అన్యాయంగా సంపాదించిన సొమ్ములో ఈ పన్నెండు రూపాయలు చాలా చాలా చిన్నమొత్తం. అయినా ఆ పన్నెండు రూపాయలూ పన్నెండు టన్నుల బరువులాగ తోస్తున్నాయి.

'అలాగే.... నా తప్పును కడిగేసుకుంటాను.... కానీ సమయం చూసి....'

అంటూ తన మనసుకి వచ్చచెప్పాడు కరుణాకరం.

ఆ మునలమ్మవంక అభిమానపూర్వకంగా చూశాడు.

పాపం! కూతురి కాపురం గురించి ఎంత బాధపడుతోంది!

పోనీ.... కొడుకుదగ్గరయినా సుఖంగా వుందో లేదో....

"అవ్వా మీ అబ్బాయి దగ్గర నువ్వు సుఖంగానే వున్నావు కదా!" అన్నాడు కరుణాకరం, అక్కడ ఆమె సుఖపడుతోందన్న విషయం ఆమె ద్వారానే విని సంతోషపడదామన్న ఉద్దేశ్యంతో.

ఒకసారి నిట్టూర్చింది ఆమె. కరుణాకరం దెబ్బతిన్నాడు.

"ఏదేం అవ్వా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏం చెప్పను బాబూ!....నా కొడుకు మంచివాడే....వాడిలో దీపం పెట్టి వెతికినా లోపం కనిపించదు. వాడొక సత్తెకాలం మనిషి.... ఇబ్బంది అంతా కోడలు పిల్లతోనే. అయినదానికీ, కానిదానికీ కల్పించుకుని, లంకంత నోరు పెట్టుకుని అరుస్తూ నరకం సృష్టించిపెడుతుంది నా కొడుకు ఇంట్లో వున్నంతసేపూ నన్ను గౌరవంగా చూస్తుంది. వాడు బయటకు వెళ్ళగానే ఇక నాకు రంపపు కోత మొదలు. చాలాసార్లు సహనం నశించి ఈ విషయం వాడికి చెప్పాలని అనుకుంటాను గానీ.... మళ్ళీ నా కారణంగా ఆ ఇద్దరూ గొడవపడతారని తెలిసి పెదవి విప్పను.... నేను మాత్రం ఇంకెంతకాలం బ్రతుకుతాను నాయనా..!" అంది ఆమె.

"అదేమిటి అవ్వా అలా అంటావు? నువ్వింకా పది కాలాలపాటు బ్రతకాలి." అన్నాడు కరుణాకరం సిన్సియర్‌గా.

"ఇంకెందుకు నాయనా! ఊరు పొమ్మంటూంది...కాడు రమ్మంటూంది....ఇంతకీ ఏం చెప్తున్నాను?....మా కోడలు గురించి కదూ?.... ఇప్పుడు ఈ ప్రయాణానికి కూడా పెద్ద రాద్ధాంతం చేసింది. అతి కష్టం మీద బయలుదేరగలిగాను...."

"ఏం? ఎందుకని?"

"మా అమ్మాయి ఆరోగ్యం మరింత దెబ్బతిన్నదని నిన్న ఉత్తరం వచ్చింది. దాన్ని చూసినప్పటినుంచీ నా మనసు మనసులో లేదు. వెంటనే 'రావులపాలెం' వెళ్ళి కూతుర్ని చూడాలని కోరిక పట్టింది. ఆ విషయం కొడుకుతో చెప్పాను. వెంటనే అంగీకరించి వెళ్ళమన్నాడు. కానీ చిక్కంతా కోడలుతో వచ్చింది. మూతి ముడుచుకుంది. ఇప్పుడు వెళ్ళడం అనవసరం అని గొణిగింది. ఆ విషయంలో కొడుకుని ఒప్పించాలని అష్టకష్టాలు పడింది. ఆమె బాధ వేరు... ఇంట్లో పని చెయ్యవల్సిన పనిమనిషి వెళ్ళిపోతోందని బెంగ...."

"అదేమిటి అవ్వా! ఈ వయసులో కూడా నువ్వు ఇంటిపనులు చేస్తావా?" ఆశ్చర్యంగా అడిగేడు కరుణాకరం.

"అవును.... ఓపిక ఉన్నంతలో ఏదో ఒక పని చేస్తూనే వుంటాను. ఖాళీగా కూర్చుంటే చైము మాత్రం ఎలా గడుస్తుందీ? నిజానికి ఈ వయసులో నాకు వున్న ఓపిక మా కోడలుపిల్లకు లేదంటే నమ్ము...." అంది ఆమె.

చిన్నగా నవ్వేడు కరుణాకరం.

"అది నిజమే.... ఆ రోజుల్లో మీరు తిన్న తిండి వేరు...." అన్నాడు.

"నిజమే.... ఇంకా ఇప్పుడు వయసు మీదపడి కొంచెం ఓపిక సన్నగిల్లిపోయిందిగానీ....నేను కొత్తగా అత్తవారి ఇంటికి వెళ్ళినప్పుడు ఎంతపని చేసేదాన్నో.... చెరువుగట్టున ఉన్న నూతి నుంచి కపీనం యాభై బిందెల నీళ్ళు మోసుకుని వచ్చేదాన్ని.... గుండిగలతో అన్నం వార్చేదాన్ని...." అంది ఆమె.

కరుణాకరం కళ్ళముందు అతని తల్లి మెదిలింది.

ఆమె కూడా ఎంతో పని చేసేది. కరుణాకరంకి లీలగా గుర్తు. ఊడుమూడి గ్రామంలో చెరువుగట్టుకు పక్కగా వుండేది వాళ్ళఇల్లు.... అతని తల్లికూడా శ్రమ అంటే ఏమిటో తెలియక, ఒళ్లు దాచుకోక పనిచేసేది. ఎంతో పెద్దగా వున్న వకులపాక క్షేత్రం చేసేది. తరుచు ఎవరో ఒకరు వస్తూ పోతూ వుండే ఆ ఇంట్లో అందరికీ వండి వడ్డించేది. ఆమె...ఆమె..రాచరాచ రోగిష్ఠిదై మరణించింది.

కరుణాకరం కళ్ళు చెమర్చాయి.

"నిన్ను చూస్తుంటే.... మా అమ్మ గుర్తుకు వచ్చింది అవ్వా...." అన్నాడు బాధామిళిత స్వరంతో.

"ఏం బాబూ! .... మీ అమ్మగారు లేరా?" జాలిగా అడిగింది ఆమె.

"లేదవ్వా! పది సంవత్సరాలక్రితం కాళ్ళకు పీరుపట్టి చనిపోయింది.

ఈ మాటలు అంటున్నప్పుడు కరుణాకరం మనసులో బాధ సుళ్లు తిరిగింది.

అతని మిగతా తోబుట్టువు లందరికంటే, తల్లితో ఎక్కువ అనుబంధం అతనికే.

అప్యాయంగా కరుణాకరం చేతిని ఆమె తాకింది.

ఆ మాతృహస్తం గంధంకంటె చల్లగా తోచింది కరుణాకరంకి.

"పోనీలే బాబూ! జరిగిపోయిన దానికి బాధపడకూడదు .... నన్నే . నీ తల్లి అనుకో...."

ఆశ్చర్యంగా, ఆనందంగా కళ్ళు విప్పార్చి చూశాడు ఆమెవంక.

"ఎంత మంచిదానివి నువ్వు...." అన్నాడు.

మునలమ్మ మాట్లాడలేదు.

ఒక నిముషం తర్వాత ఏదో గుర్తు వచ్చినట్లు అన్నాడు.

"ఆ తర్వాత ఏమైంది?"

"ఏముంది? అనవసరంగా డబ్బు ఖర్చు.... ఇప్పుడు వెళ్ళకపోతే ఏమవు

తుంది.... అంటూ కోడలుపిల్ల గొణిగింది. ఆ ఉత్తరం చూశాక నా కూతుర్ని చూడకుండా వుండలేననీ అనిపించింది. నన్ను అర్థంచేసుకున్న నా కొడుకు 'డబ్బు అమ్మదగ్గర వుందిలే....' అంటూ అబద్ధం చెప్పాడు దానితో. బయలుదేరేముందు యాభై కాగితం చేతిలో పెట్టి 'నువ్వు వెళ్ళమ్మా' అన్నాడు. ఆ యాభై కే కదా నాయనా .... నీ దగ్గర చిల్లర లేక పోయింది...."

కరుణాకరం చెంపమీద ఎవరో గట్టిగా కొట్టినట్లు అయ్యింది.

మౌనం వహించాడు.

"నీతోపాటు కూడా ఎవరైనా రావల్సింది...." అన్నాడు కరుణాకరం.

"ఆ మాట మా అబ్బాయి కూడా అన్నాడు. ఆఫీసులో పై అధికారి ఎవరో వచ్చారట. ఈ రోజు శలవు దొరకదట. రెండురోజులు ఆగేక అయితే కూడా వస్తానన్నాడు కానీ అన్ని రోజులు ఆగడానికి మనసు ఒప్పుకోలేదు. ఫర్వాలేదులే అని ధైర్యంచేసి ఒక్కత్తినీ బయలుదేరాను... పగటి ప్రయాణమేకదా.... "రావులపాలెం వచ్చినప్పుడు కొంచెం నాకు చెప్పు బాబూ.... దిగుతాను...." అంది.

"మీ అమ్మాయి ఇంటికి ఒక్కత్తివీ వెళ్ళగలవా ఆ ఊళ్ళో?" దిగేదు.

"ఏ రిక్షావాడినో బతిమాలుకుంటాన్లే నాయనా...." అంది ఆమె.

ఒక నిముషం ఆలోచించాడు కరుణాకరం.

"ఫర్వాలేదులే అవ్వా!.... రిక్షా నేను మాట్లాడి ఎక్కిస్తానులే...." అన్నాడు.

ముసలమ్మ ముఖంలో కొండంత సంతోషం....

"అంతకంటేనా బాబూ! నీకు కోలెడు పుణ్యం వస్తుంది...."

బస్సు వెళ్తూనే వుంది.... రొద చేసుకుంటూ.

ఆమె పన్నెండు రూపాయలూ ఆమెకు ఏ రకంగా తిరిగి ఇయ్యాలా అని ఆలోచించాడు అందుకే కాస్సేపు క్యాష్ లెక్కపెట్టాపి ఆశ్చర్యపోయినట్లు నటించాడు.

"అవ్వా! నన్ను క్షమించాలి నువ్వు.." అన్నాడు.

"ఎందుకు నాయనా! ఏమైంది?" అంది ఆమె ఆశ్చర్యంగా.

"నీ దగ్గర పొరపాటున సొమ్ము ఎక్కువ తీసుకున్నాను." అంటూ పన్నెండు రూపాయలు ఆమె చేతిలో పెట్టాడు.

"ఇంకెవరి దగ్గర నుంచయినా తీసుకున్నావేమో! నా దగ్గరే అని ఏముంది?" అంది ఆమె ఆ సొమ్ము తీసుకోకుండా.

"లేదవ్వా! నీదే ఈ సొమ్ము .. నాకు బాగా గుర్తు ...." అన్నాడు ఆమెను నమ్మించడానికి ప్రయత్నిస్తూ.

"అయితే సరే .." అంటూ ఆ సొమ్ము అందుకుని చీరచెంగులో ముడిపెట్టుకుంది.

"నీ నిజాయితీ మెచ్చదగ్గది బాబూ.." అంది ఆమె.

కరుణాకరం తల వంచుకున్నాడు తప్ప మాట్లాడలేదు.

"ఎన్నాళ్లు వుంటావు అవ్వా రావుల పాలెంలో?" అన్నాడు సంభాషణ మారుస్తూ.

"చెప్పలేను బాబూ.... అమ్మాయి పరిస్థితినిబట్టి వుంటుంది.... మామూలుగా అయితే ఒక నెల రోజులు వుండాలని వెళ్తున్నాను. అక్కడకు వెళ్తేగాని ఏమీ చెప్పలేను...." అంది ఆమె.

తల ఊపాడు కరుణాకరం.

మరొక పది నిముషాల్లో బస్సు రావుల పాలెం చేరుకుంది.

"రావులపాలెం వచ్చేశాం....అందరూ దిగేక దిగుదువుగాని.... నిన్ను నేను రిక్షా ఎక్కిస్తాను...." అన్నాడు కరుణాకరం.

సరేనంది ఆమె.

పదిమంది దాకా దిగేరు. ఆ తర్వాత ముసలమ్మకు చెయ్యి అందించి ఆమెను దింపి, తనూ దిగేడు కరుణాకరం.

తలుపుదగ్గర ఎక్కడం కోసం వచ్చిన ప్రయాణీకులతో—

"బస్సు ఎక్కి కూర్చోండి..టిక్కెట్లు తర్వాత ఇస్తాను...." అన్నాడు కరుణాకరం.

బస్సు దిగగానే ఎదురుగా అతనికి పళ్ళ దుకాణం కనిపించింది.

అతనికొక ఆలోచన వచ్చింది....తను ఆమెకు చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తంగా ఆమెకు పళ్లుకొని ఇస్తే?

ఆమెను అక్కడే వుండమని దుకాణం దగ్గరకు వెళ్ళి ఒక కిలో యాపిల్ పళ్ళు, ఒక డజను అరటిపళ్ళు కొని తెచ్చాడు.

"నా తృప్తికోసం నువ్వు వీటిని తీసుకోవాలి అవ్వా...." అన్నాడు.

"వద్దు.... ఎందుకు బాబూ అనవసరంగా...." అంది ఆమె.

కరుణాకరం ఒప్పుకోలేదు...ఆమెను బలవంతంచేసి చేతిలో పెట్టాడు.

ఆమెకు తీసుకోక తప్పలేదు.

అప్పుడే కరుణాకరంకి తెలిసిన ఒక రిక్షావాడు కనిపించాడు.

రిక్షా పిలిచి ఆమెను ఎక్కించాడు.

"ఎక్కడకు వెళ్ళాలి అవ్వా" అడిగేడు కరుణాకరం.

ఆమె చెప్పింది.

కరుణాకరం ఆశ్చర్యంగా .. "కనకం గారి ఇంటికా? అన్నాడు."

"అవునుబాబూ! ఆమె నా కూతురు.." అంది ఆమె.

కరుణాకరం రావులపాలెంలోనే చదువుకున్నాడు. ఆ కనకం ఇంటి పక్కనే వుండేవాడు. ఆమె అతన్ని కన్న తల్లిలా ఆదరించేది. కనకం అంటే అతనికి ఎంతో గౌరవం.

"ఆమె నాకు తెలుసు అవ్వా! కండక్టర్ కరుణాకరం అడిగేడని ఆమెకు చెప్పు.

నా నమస్కారాలు అందచెయ్యి...." అన్నాడు ఆమెతో.

"అలాగే బాబూ...." అంది ముసలమ్మ సంతోషంగా.

రిక్షావాడికి రెండు రూపాయలు ఇచ్చాడు కరుణాకరం

"ఈమెను ఇంటి దగ్గర దింపు. సాయంత్రం రిటర్న్ ట్రిప్పులో అయిదు గంటలకు మళ్ళీ వస్తాను. అప్పుడు నువ్వు నాకు ఆమెను క్షేమంగా దింపిన విషయం చెప్పాలి...." అన్నాడు రిక్షావాడితో.

"అలాగే దొరా...." అన్నాడు రిక్షావాడు.

"రిక్షాడబ్బులు నేను ఇచ్చాను అవ్వా! ఇక నువ్వు ఇయ్యకు.... వెళ్ళిరా..." అన్నాడు అవ్వతో కరుణాకరం.

"ఎందుకిచ్చావు బాబూ!" అంది అవ్వ.

"పర్వాలేదు...." అన్నాడు. రిక్షా కదిలింది. చెయ్యి ఊపాడు కరుణాకరం.

అవ్వవైపు తృప్తిగా చూసి బస్సు ఎక్కాడు.

అక్కడ ఎక్కిన ప్రయాణీకులందరికీ టిక్కెట్లు కొట్టాడు.

'టీ' తాగిన డ్రైవరు వచ్చి బస్సు ఎక్కాడు.

"టీ తాగకుండా ఆ ముసలమ్మతో పెట్టుకుని కూర్చున్నావు ఏమిటి? ఆమె నీ బంధువా?" అన్నాడు డ్రైవరు.

"అవును.... ఆమె మా అమ్మమ్మ.... పద....రైట్...." అన్నాడు కరుణాకరం డోర్ మూస్తూ.

బస్సు బయలుదేరింది.

కరుణాకరం కళ్ళముందు ఆ ముసలమ్మ మరొక్కసారి మెదిలింది.

సీట్లో కూర్చుని వెనక్కు వాల్లపడి కళ్ళు మూసుకున్నాడు కరుణాకరం.

ఇకముందు ఎన్నడూ తాగకూడదనీ, భార్యను కొట్టకూడదనీ నిర్ణయించుకున్నాడు. అంతేకాదు... ఎదుటివాళ్ళు ఎలాంటివాళ్ళు అయినా తేలిగ్గా చూడకూడదని నిర్ణయించుకున్నాడు.

గతంలో అతని మనసులో కొద్దిపాటి కల్మషం వున్నా.... దాన్ని కడిగేసుకుని పునీతుడైన కరుణాకరం నిజమైన మనిషి....

అవును.... నిజమైన మనిషి....

